# సనాతనధర్మమే మానవ మనుగడకు ఆధారం

గుండా శివచరణ్



నేటి సమాజం ప్రపంచీకరణ దిశగా సాగుతున్న పరిణామక్రమంలో భిన్నమతాలు, భిన్న సంస్కృతులు కలిసి మనుగడ సాగించవలసిన ఆవశ్యకత ఏర్పడింది.కానీ మానవజాతి మొత్తం నేడు అశాంతి, సంక్షోభం ఎదుర్కొంటుంది. శాంతియుత సహజీవనానికి ఉపకరించే పరిస్థితులు నేడు నెలకొని లేవు.సామాన్య మానవుని దృష్టి లో మతం ఒక భయం. ధర్మాన్ని వీడి నర్తించిన సమాజ దేహం వాంఛల ఎండ మావుల వెంట పడి వంచనలను ఆశ్రయించి రోగగ్రస్తమైంది.

ఈ పరిస్థితులలో సమాజాన్ని రక్షించే ఏకైక సాధనం సనాతనధర్మం.ఇదే వేద ధర్మం. వేద ధర్మమంటే ఏ మార్గంలో మనుష్యుడు నడిస్తే జన్మ సార్థకం అవుతుందో అది. అనాదిగా,అనంతంగా వేదములాధారంగా గల ధర్మమే సనాతనధర్మం.ఇది నాశనం లేనిది. భారతీయ సంస్కృతికి మూలాధారమైన ఈ సనాతనధర్మం అన్ని రంగాలలో అంతర్నిహితమై వ్యాపించిఉన్నది.భిన్నత్వంలో ఏకత్వం నిర్ణయించడమే ఈ సంస్కృతిలోని ఒక విశిష్ట లక్షణం. తత్వ చింతన, ఉపాసన,యోగం, కర్మనిష్ట అని ప్రధానంగా ఈ భారతీయ భావధారలోని పాయలు.ఈ వైవిధ్య భరితమైన మార్గాలన్నీ ఒకే వైదిక మూలం నుండి ప్రారంభమై ఒకే గమ్యం వైపు ప్రయాణిస్తున్నాయి.

పెర్షియన్లు 'స' కార, హ కారాలకు ఉచ్చారణా బేధాన్ని పాటించక సింధునది ని హిందు నదిగా , సింధునదికి తూర్పున ఉన్నవారందరినీ హిందువులుగా పరిగణించారు. ఆ విధంగా ఆర్యావర్తం లో పరిఢవిల్లిన సనాతనధర్మం హైందవ ధర్మమైంది.ఈ వేదధర్మం ఆధారంగా ఉద్భవించిందే హిందూమతం.

ఇది ఏ ఒక్క వ్యక్తి చేతనూ నిర్మాణం చేయబడక ఏ ఒక్క గ్రంథం మాత్రమో ప్రమాణంగా

తీసుకోక, అనేక ధర్మ రహస్యాలపై ధారపడి పెరిగిన మహావృక్షం. దీని సమగ్ర స్వరూపం అందరికీ అర్థమయ్యేది కాదు.పరస్పర విరుద్ధంగా కనపడే సిద్ధాంతాలు, విశ్వాసాలు,జీవన విధానాలు ఇందులో ఇమిడి ఉన్నాయి.దీన్ని సమగ్రంగా తెలుసుకొన్నవారే పండితులు.దేనియందూ విరోధభావం లేని అవగాహన కలవారే జ్ఞానులు. ఈ సనాతన ధర్మాన్ని సమగ్రంగా అవగతం చేసుకొన్న వాడే లోకంలో సమస్తాన్ని అర్థంచేసుకున్న విశ్వకుటుంబ సభ్యుడు కాగలడు.రెండు దేశాల మధ్య యుద్ధానికి మారణహోమానికి, ద్వేషానికి మతం కారణమైతే అది మతం లోపం కాదు. మతం లోని నీతి సూత్రాలు  మతస్థులు అవగాహన చేసుకోకపోవడమే. అందుకే సనాతన ధర్మ సూత్రాలను అందరూ అవగాహనచేసుకునే ప్రయత్నం చేయాలి. ఉదాహరణకు సనాతన ధర్మం పురుషార్థాలు నాలుగని చెప్పింది. ఏ కాలమందైనా, ఎవరికైనా ఇది వర్తిస్తుంది. ఏవిధంగా అంటే, శాంతిభద్రతలతో కూడిన సంఘజీవనం వ్యక్తియొక్క ధర్మరక్షణపై ఆధారపడి ఉంటుంది.ధర్మయుత జీవనం సంఘక్షేమాన్ని ఇవ్వగలదు.ధర్మవిరుద్ధమైన అర్థకామములు,వాటి సంపాదనా ప్రయత్నములూ పరిహార్యములే.ధర్మము ననుసరించిన వాడు పరిశుద్ధుడై, ఈశ్వరునికి ప్రీతిపాత్రుడై క్రమంగా జ్ఞాన వైరాగ్యములు పొందగలడు. ముక్తుడు కాగలడు.అందువలన ధర్మమే ప్రధానం. ఈ ధర్మమందలి అంతర్భాగములే నీతి, కరుణ,సత్యం,అహింస మొదలైనవి.వీటిని పదిలంగా కాపాడిన జీవనం సార్థకమై పూజ్యత పొంది లోకకల్యాణప్రదమగును.

వివిధ శాఖలుగా విస్తరిల్లిన మనసంస్కృతిలో భాగమైన పురాణాల లోని సారాన్ని వ్యాసుల వారు 'పరోపకారాయ పుణ్యాయ పాపాయ పరపీడనం' అని సమీక్షించారు. పరులకు ఉపకారం చేయడం వలన పుణ్యం పీడించడం వలన పాపము కలుగుతుందని అర్థం. మతాల పేరిట జరిగే హింసను సమర్థించని ఈ సనాతన ధర్మ సూత్రం అందరకూ అనుసరణీయం.

'ఎప్పుడూ సహాయం చేయి, ఎవరినీ బాధించకు' అనే సాయిబాబా ప్రభోధం కూడా ఇదే.

ఈ సనాతనధర్మంలోని వైవిధ్యభరిత స్వేచ్ఛని అవగాహనచేసుకోలేని కుహనా మేధావులు సంప్రదాయ మూలాలను విస్మరించి భారతీయ ధర్మాన్నే తూలనాడే ప్రయత్నాలు చేస్తున్నారు.

వారు ప్రధానంగా అర్థంచేసుకోవలసింది సనాతనధర్మమంటే ఒక జీవనవిధానం. మతాలు

ప్రభోదించే నమ్మిక కాదు. శ్రీ అరవిందుల వారి మాటల్లో భారతీయతకు సనాతనధర్మానికి బేధం లేదు.

సద్గురు శ్రీ శివానందమూర్తి గారు " హిందూ ధర్మం అంటే హిందూ జాతియొక్క మహాప్రవాహం. ఈ జాతి, ఇందులోని ప్రజ, ఈ దేశం, ఈ సంస్కృతి మొత్తాన్ని కాపాడటానికి పూనుకున్నవాడే భారతీయుడవుతాడు. భారతీయ ధర్మాన్ని రక్షించుకోవలసిన బాధ్యత హిందువులపై ఉంది, క్రిష్టియన్లపై ఉంది, ముసిల్మ ల పై ఉంది. అందరిపై ఉంది. ఎవరైనా మొదట భారతీయుడు, తరవాతే హిందువు లేదా మహమ్మదీయుడు, లేక కైస్త్రవుడు. విశాలమైన అర్థంలో భారతీయతకు, హిందూ ధర్మానికి వైరుధ్యం లేదు" అని అంటారు.

సనాతనధర్మం ప్రభోదించే జాతీయతాభావాలు ప్రతివ్యక్తి ఆలోచనా స్రవంతిలో,జీవన విధానం లో భాగమైతే అన్ని మతాలు అందరికి సమ్మతమై సమైక్య జీవన సౌందర్యానికి దారులు వేసినట్లవుతుంది.

ఆ సుందర స్వప్నం నిజం కావాలని ఎదురుచూద్దాం.

సర్వేజనా సుఖినోభవన్తు. సమస్త సన్మంగళానిభవన్తు